క్లుప్తంగా

రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు ప్రారంభం



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఆకివీడు: రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన మంగళవారం ప్రాంభమయ్యాయి. పోటీల్లో ఏలూరుపాడు, గునుపూడి, చీరాల, బాపట్ల, కోరుకొల్లు, వేమవరప్పాడు, ఆకివీడు, చెరుకుమిల్లి, కమతవానిగూడెం టీమ్‌లు పోటీ పడ్డాయి. మొదటి రోజు పోటీల్లో ఆయా టీమ్‌లు తలపడుతుంటే క్రీడాభిమానులు ఆసక్తిగా తిలకించారు. రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల ఫైనల్ బుధవారం జరుగనుందని నిర్వాహక కమిటీ ప్రతినిధి డోకల రవి తేజ చెప్పారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండల కేంద్రమైన పాలకోడేరు గ్రామానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు దెందుకూరి వెంకట సుబ్బ రాజు 100 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నంకు చెందిన శివప్రియ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుబ్బరాజు కుమార్తె సత్యవతి, కృష్ణంరాజు దంపతుల సౌజన్యంతో 1000 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సుబ్బరాజు కుమారులు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, గణపతిరాజు, కామన రాంబాబు, దొంగా కృష్ణ, మాధవ, సీహెచ్ వెంకటేశ్వ రరావు, రాజు, మోహనరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగారమ్మ జాతర

నరసాపురం: పట్టణంలోని 31వ వార్డు చినమామిడిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ నాగారమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. బుధవారం రాత్రి అమ్మవారి సంబరం ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. గురువారంతో ఉత్సవాలు ముగుస్తాయని, ఈనెల 27వ తేదీన అన్నసమారాధన ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.

వైభవంగా మావుళ్లమ్మ జాతర



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

పెనుగొండ: సిద్ధాంతం శివారు నక్కావారి పాలెంలో మావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం మహిళలు సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. మంగళవారం రాత్రి సంప్రదాయ నృత్యాలు, శక్తి వేషాలు, బాణసంచా కాల్పులతో గ్రామోత్సవం నిర్వహించారు.

నగరేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన జడ్జిలు



ఆలయ ప్రాంగణంలో కాకినాడ జిల్లా జడ్జిలు

పెనుగొండ: సంక్రాంతి సందర్భంగా సోమవారం పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని అఖిల భారత శ్రీ వాసవి పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యానర వాసవి శాంతిధాంలను కాకినాడ జిల్లా జడ్జిలు సందర్శించి పూజలు నిర్వహించారు. జిల్లా జడ్జిలు ఉషాలక్ష్మి, శ్రీదేవిలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇరు ఆలయాల్లోనూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అర్చకులు కేవీ సుబ్రహ్మణ్యం స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం పలికారు. శేషవస్త్రాలతో సత్కరించారు.

వీరభద్రస్వామి రథోత్సవం

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరులో వేంచేసి యున్న శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామానికి చెందిన మంచెం శ్రీనివాస్ దంపతులు స్వామి, అమ్మవారికి కల్యాణోత్సవ పూజలు చేశారు. అనంతరం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో రథోత్సవం నిర్వహించారు. రథానికి ముందు కుంభం పోశారు. గ్రామస్తులు రథాన్ని లాగారు.

మూడు రోజులూ యథేచ్ఛగా కోడి పందేలు



కాళ్ల: కాళ్లకూరులో పుంజులతో పందెంరాయుళ్లు



ఉండి: మహదేవపట్నంలో నిర్వహిస్తున్న కోడి పందేలు



భీమవరం అర్బన్: మండలంలోని చిన అమిరంలో కోడి పందేలు నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మూడు రోజులూ కోడి పందేలు జోరుగా సాగాయి. కోడి పందేల్లో మూడు రోజులకు గానూ మండలంలో సుమారు పది కోట్ల రూపాయలు చేతులు మారినట్లు పందెంరాయుళ్లు అంచనా వేస్తున్నారు. సంక్రాంతి, కనుమ రెండు రోజుల్లో భారీ ఎత్తున కోడి పందేలు వేశారు. పగలే కాకుండా కొన్ని గ్రామాల్లో రాత్రిపూట నిర్వహిచేందుకు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించారు. జాతరను తలపించేలా గ్రామాలన్నీ కోలాహలంగా మారాయి. కోడిపందేలకు వచ్చే వాళ్లతో రోడ్లన్నీ స్తంభించిపోయాయి. మండలంలో ప్రధానంగా సీసలి, పెద అమిరం గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ కోడి పందేల బరిలో పందెంరాయుళ్లకు ఇబ్బంది కలగకుండా పందేలు వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. పందెంరాయుళ్లను కట్టడి చేసేందుకు బౌన్సర్‌లను ఏర్పాటు చేశారు. పండుగ మూడు రోజులు కోడి పందేలను తిలకించేందుకు ప్రత్యేక పాస్‌లు ఏర్పాటు చేశారు. ప్రధానంగా మండలంలో కాళ్ళకూరు, ఏలూరుపాడు, కాళ్ల, సీసలి, కోపల్లె, జక్కరం, పెద అమిరం, మాలవానితిప్ప గ్రామాల్లో జోరుగా పందేలు నిర్వహించారు. సీసలి కోడి పందేల బరిలో నియోజకవర్గ స్థాయి నాయకులతో పాటు తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు నాయకులు, వైజాగ్ ఎమ్మెల్యే జేకే రాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, గోకరాజు రామరాజు, దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఎమ్మెల్సీ పాందువ్వ శ్రీను, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు కోడి పందేలను తిలకించారు. అంతేకాక పందేలు తిలకించేందుకు వచ్చిన పందెం రాయుళ్లు, ప్రజలకు భోజనాలు ఏర్పాటు చేశారు.

కాలు దువ్విన కోడి..

ఉండి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలో ముచ్చటగా మూడో రోజు మంగళవారం కూడా పందెం రాయుళ్ళు జోరుగా పందేలు వేశారు. భారీ బరులను సిద్ధం చేసిన నిర్వాహకులు పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహిస్తూ అత్యధిక పందేలు గెలిచిన వారికి బుల్లెట్ బహుమతిగా అందిస్తామంటూ వాహనాన్ని ప్రదర్శనగా ఉంచారు. బరుల వద్ద ఒక్కో కోడి పందెం రూ.లక్షల్లో జరిగిందంటే అతిశయోక్తి కాదు. అంతేకాక కోడి పందేలను మించి బరుల వద్ద జూదం పెద్ద ఎత్తున నిర్వహించారు. కోతాట, గుండాట, రంగులు, జంతువులు, పేకాట అంటూ ఒక్కో విధానంలో జూదం నిర్వహించారు. దీంతో జూదగాళ్ళు లెక్కలేనంతగా డబ్బు వెదజల్లారు. తెలంగాణ రాష్ట్రం నుంయి కూడా మండలానికి పెద్ద ఎత్తున జూదగాళ్ళు రావడంతో పందేలు మరింత రక్తికట్టాయి. మొదటి రెండురోజుల్లోనూ రాత్రీపగలు తేడా లేకుండా పందేలు, జూదం నిర్వహించారు. మూడో రోజు సాయంత్రం వరకు కూడా పందేలు కొనసాగుతూనే ఉన్నాయి. మొత్తం మీద మండల వ్యాప్తంగా ఉండి, మహదేవపట్నం, కోలమూరు, చినపుల్లేరు, ఎన్నార్పీ అగ్రహారం, చెరుకువాడ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన కోడి పందేలు, జూదంలో సుమారుగా రూ.7 నుంచి రూ.8 కోట్ల వరకు చేతులు మారినట్లు సమాచారం. కత్తులు కట్టని కోడి పందేలకు అనుమతి ఉన్నా గాని కత్తులు కట్టి పందేలు నిర్వహించడంతో పాటు పెద్ద పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారం చేశారు. సంప్రదాయాల ముసుగులో ఇంత జరుగుతున్నా మూడు రోజులుగా ఉన్నతాధికారి సంగతి అటుంచితే కానిస్టేబుల్ కూడా అటు వైపుగా వెళ్ళకపోవడం గమనార్హం.

ఢీకొన్న పందెం కోళ్లు

భీమవరం అర్బన్: సంక్రాంతి సందర్భంగా మూడో రోజు మంగళవారం కోడి పందేలు జరిగాయి. తుందుర్రు, అనాకోడేరు, చినఅమిరం, యనమదుర్రు గ్రామాల్లోని బరులలో కోడి పందేలు నిర్వహించారు. రైతులు సంప్రదాయ వస్త్రాధారణ ధరించి తిలకించారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే పోలీసులు, అధికారులు కోడి పందేలు మాటున జూదాలు ఆడే వారిపై ఉక్కుపాదం మోపడంతో గొడవలు జరగకుండా ప్రశాంతంగా జరిగాయి. దీంతో కొన్ని చోట్ల మహిళలు కోడి పందేలను తిలకించేందుకు వచ్చారు.

ఇద్దరు మిత్రుల మధ్య వినూత్న పందెం

పాలకోడేరు: సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు సంప్రదాయం ముసుగులో కోడి పందేలు జోరుగా సాగాయి. కోట్లాది రూపాయలు చేతులు మారాయి. సందట్లో సడేమియా అన్నట్లు గుండాటలు, కోతాటలు కూడా బాగానే జరిగాయి. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు లాంటి సుదూర ప్రాంతాల నుంచి ఉద్యోగాలు కోసం వెళ్ళిన వారు స్వగ్రామాలకు వచ్చి కోడి పందేల్లో పాల్గొని తనివితీరా ఎంజాయ్ చేశారు. విజయవాడకు చెందిన సతీష్, శృంగవృక్షంకు చెందిన ఈలి దుర్గా వెంకట శివ ఇద్దరు స్నేహితులు. వీళ్లిద్దరూ కలిసి వినూత్నమైన పందెం వేసుకున్నారు. ఇద్దరూ కలిసి 2 లక్షల 61 వేల రూపాయలతో రాయల్ ఎన్‌ఫీల్డ్(బుల్లెట్) మోటార్ బైక్ చెరి సగం వేసుకుని కొనుక్కున్నారు. పెన్నాడలో జరుగుతున్న కోడి పందేల్లో పాల్గొని ఒక కోడిపై పందెం కాశారు. ఎవరు నెగ్గితే వాళ్ళదే బైక్ అని పందెం వేసుకున్నారు. ఈ పందెంలో శివ నెగ్గి బైక్‌ని సొంతం చేసుకున్నారు. ఈ పందెం హాట్ టాపిక్‌గా మారింది. రెండేళ్ల క్రితం ఈ బరిలో ఇలాంటి పందెమే జరిగింది. మిత్రులు శివను అభినందించారు.

కోడి పందేలపై దాడి.. 10 మంది అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఎస్సై బి.మోహన్‌రావు తన సిబ్బందితో కోడి పందేలు, పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 10 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.7,150 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టవరంలో అలరించిన ముగ్గుల పోటీలు

నరసాపురం రూరల్: నరసాపురం మండలం చిట్టవరం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా రంగవల్లికలను తీర్చిదిద్దారు. సంక్రాంతి, గంగిరెద్దుల ప్రదర్శన తదితర ముగ్గులు అలరించాయి. గ్రామంలోని ప్రధాన రహదారులపై ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ వేడుక సాగింది. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, బండి స్వర్ణలత, రంగినీడి భరణి, తోట అరుణ, గంట వెంకటరమణ వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మన సంస్కృతిలో ముగ్గులకు ఉన్న ప్రాముఖ్యతను గురించి వివరించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కోపల్లి శ్రీనివాస్, కర్రా నరేష్, చల్లా భాస్కర్ పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో సంక్రాంతి సంబరాలు



భీమవరం (ప్రకాశం చౌక్): రాయప్రోలు అపార్ట్‌మెంట్‌లో సంక్రాంతి సెట్టింగ్



వీరవాసరం: రాయకుదురులో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లా కేంద్రం భీమవరంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకై అన్నట్లుగా కనుమ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. కుటుంబ సమేతంగా సంక్రాంతి సంబరాల్లో పాల్గొని చిన్నాపెద్ద సరదా సరదాగా గడిపారు. ఇంటి ముందు వేసిన సంక్రాంతి ముగ్గులు పండగ వాతావరణం కళ్ళకు కనువిందు చేశాయి. ఇంటిలో అనేక రకాల పిండి వంటలు చేసుకుని కుటుంబ సభ్యులందరూ సహపంక్తి భోజనాలు చేశారు. ఆటపాటలు, పిల్లల డాన్సులతో గాలిపటాలు ఎగరవేస్తూ, ఎంతో సరదాగా సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. అలాగే కోడి పందేలు ఆడుతూ తిలకిస్తూ మహిళలు సైతం ఉత్సాహంగా గడిపారు. హరిదాసుల సంకీర్తనలతో గంగిరెద్దుల నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఆలయాలు దర్శనాలు గోపూజలు కూడా నిర్వహించారు. ముఖ్యంగా హైదరాబాదు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన జనం భీమవరంలో సంక్రాంతి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: సంక్రాంతి సంబరాలు మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో ఆటల పోటీలు, ముగ్గులు పోటీలు ఏర్పాటు చేశారు. రాయకుదురులో మహిళలు మహారాణులు గ్రూపు ఆధ్వర్యాన ఆటలు పోటీలు, ముగ్గుల పోటీలు, సంక్రాంతి విచిత్ర వేషధారణ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో గణపతినీడి సామ్రాజ్య విజయలక్ష్మి, నుదురుపాటి శ్వేత, దూది అరుణ, ముప్పన లక్ష్మి, గణపతినీడి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



బహుమతి అందిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు

భీమవరం అర్బన్: ప్రతి రోజూ క్రీడలు ఆడటం వల్ల మానసిక ప్రశాంతత చేకూరడంతో పాటు దేహదారుఢ్యం పెరుగుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు అన్నారు. భీమవరం మండలంలోని కొత్తపూసలమర్రు గ్రామంలో దాతలు ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, వాటాల రామరాజుల సౌజన్యంతో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు మంగళవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ దైనందిన జీవితంలో పనుల ఒత్తిడితో తీవ్రంగా సతమతమై అనారోగ్యాలకు గురవుతున్నామని, ఇటువంటి క్రీడా పోటీలలో పాల్గొనడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అంతేకాకుండా గ్రామీణ స్థాయిలో ఇటువంటి పోటీలు నిర్వహించడం ఎంతోమంది క్రీడాకారులు తమ ప్రతిభను కనబరుస్తారన్నారు. అనంతరం టోర్నమెంట్‌లో ప్రథమ, ద్వితీయ విజేతలుగా నిలిచిన హరీష్, రాజు టీమ్‌లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, ఉండపల్లి గణేష్, జల్లా సూర్యచంద్రరావు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలి



దిరుసుమర్రులో రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతి అందిస్తున్న సినీ నటుడు సురేష్

భీమవరం అర్బన్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని సినిమా, టీవీ నటుడు సురేష్ అన్నారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో శ్రీ గంగా భ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల పోకడలకు నేటి యువత ఆకర్షితులవున్నారన్నారు. సంక్రాంతి పండుగలో రంగవల్లుల గొబ్బెమ్మలు, జంగమ దొర గీతాలు, డూడూ బసవన్న, ఎడ్లు, కోడి పందేలు తదితర ఎన్నో మన పూర్వీకులు నుంచి సంప్రాదాయంగా వస్తున్నాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. అంతేకాక ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల బంధుత్వం, స్నేహం పెంపొందడమే కాకుండా మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం రంగవల్లుల పోటీలు పాల్గొన్న మహిళలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లూరి బంగార్రాజు, కలిదిండి పేర్రాజు, మైగాపుల గంగారామ్, యాళ్ల బాబులు, గవర శ్రీ రాజబాబు, నక్కా రామోజీ, పండు, చిట్టూరి శ్రీనివాస్, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన సంక్రాంతి ఆటల పోటీలు



భీమవరంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలో భారత ప్రజాతంత్ర యోజన సమైక్య, డీవైఎఫ్ఐ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాల్లో భాగంగా 8 కేంద్రాల్లో ఆటలు పోటీలు నిర్వహించారు. డీవైఎఫ్ఐ నాయకుడు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా యువత పేకాట, కోడి పందేలు వంటి చెడు వ్యసనాలు వైపు వెళ్లకుండా డీవైఎఫ్ఐ 36 ఏళ్లుగా ఆటలు పోటీలు నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఆట స్థలం కేటాయించి ఆటలు పోటీలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రమేష్, శ్రీను, సింగు అనసూయమ్మ, సత్యవతి, రాంబాబు, కేతా శ్రీను, ఏడుకొండలు, రేణుక, సాయమ్మ, సీహెచ్ వరలక్ష్మి, డి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

జాతరలో క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయం

మొగల్తూరు: అమ్మవారి జాతరను పురస్కరించుకుని క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా పేరుపాలెం సౌత్ గ్రామంలో మొగదారమ్మ అమ్మవారి జాతర నిర్వహిస్తారు. ఈ సంవత్సరం అమ్మవారి జాతర సందర్భంగా ముగ్గులు, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ప్రసాదరాజు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు, నగదును అందించారు. అనంతరం మొగదారమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తిరుమాని విజయలక్ష్మి వైఎస్సార్ సీపీ నాయకులతో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు, ఆలయ పాలకవర్గ సభ్యులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభల తీర్థం



గుంపర్రు వెళ్తున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రభలు

యలమంచిలి: కనుమ పండుగ సందర్భంగా గుంపర్రు, అబ్బిరాజు పాలెం గ్రామాలలో ప్రభల తీర్థం కనుల పండుగగా జరిగింది. గుంపర్రు పంచాయతీ సుంకరపాలెం గ్రామ దేవతలు గంగానమ్మ, మారమ్మ అమ్మవార్ల ఆలయం నుంచి బయలుదేరిన ప్రభలు గుంపర్రు వెళ్లి అక్కడ సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని తీసుకుని లంకపాలెం వచ్చాయి. మళ్లీ లంకపాలెం నుంచి గుంపర్రు తీసుకెళ్లి స్వామిని ఆలయ ప్రవేశం చేయించారు. అదే విధంగా అబ్బిరాజుపాలెం గ్రామ శివాలయంలోని పర్వతవర్ధన రామలింగేశ్వరస్వామిని ప్రభల రూపంలో దొడ్డిపట్ల తీసుకువచ్చి అక్కడి నుంచి మరలా ఆలయానికి తీసుకెళ్లారు. ఈ రెండు గ్రామాలలో ప్రతి ఏడాది కనుమ పండుగ రోజున జరిగే ఈ ప్రభల తీర్థాన్ని తిలకించడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారు.

స్వామివార్ల సేవలో తెలంగాణ జీఎస్టీ జేసీ



పాలకొల్లులో జేసీ శ్రీలీలకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న చైర్మన్, ఈవో

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామివారిని తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ జాయింట్ కమిషనర్ శ్రీలీల దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. మంగళవారం ఆలయానికి విచ్చేసిన జేసీ శ్రీలీల కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల దర్శనం అనంతరం ఆలయ మండపంలో వేద ఆశీర్వచనం పలికారు. స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్ర పటాన్ని, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, చందక సత్తిబాబు, రావూరి సుధ, మండెల పణి, నిమ్మకాయల రామకృష్ణ, నాళం బాబి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మొగదారమ్మ సన్నిధిలో..

మొగల్తూరు: మొగదారమ్మను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలంగాణ రాష్ట్రానికి చెందిన జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్.శ్రీలీల తెలిపారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని పేరుపాలెం సౌత్ గ్రామంలోని బంధువుల ఇంటికి భర్త నాగేంద్రకుమార్‌తో కలిసి వచ్చిన ఆమె సోమవారం గ్రామంలో వేంచేసి యున్న మొగదారమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ కేపీ స్వామి

నరసాపురం: రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలు వీధిన పడతాయని నరసాపురం సీఐ కేపీ స్వామి అన్నారు. నరసాపురం ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ వాహనాలు ఓవర్‌టేక్ చేసే సమయంలో, రోడ్డు మార్జిన్‌లో నడపాల్సి వచ్చిన సందర్భాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరగడానికి ఆస్కారం ఉంటుందని చెప్పారు. డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఏ పద్ధతులు అవలంభించాలనే అంశంపై అవగాహన కల్పించారు. డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. బీపీ లాంటి వ్యాధులు ఉంటే తగిన మందులు వాడాలన్నారు. వచ్చేనెల 14వ తేదీ వరకూ రోడ్డు భద్రతా మాసోత్సవాలు జరుగుతాయని చెప్పారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ టి.ధనలక్ష్మి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.